క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలో ఓటు వేసి పరిశీలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని పూర్తిస్థాయిలో సాంకేతిక నిపుణులు పరిశీలించిన అనంతరమే వీటిని ఎన్నికల కోసం ఉపయోగించేలా కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎం యంత్రాన్ని, వీవీప్యాట్‌ల ప్రదర్శనను నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తదితరులు ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. తమ అనుమానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, అంద్రా వెంకట సుబ్బారెడ్డి, కౌన్సిలర్ శివకోటారెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడి కుటుంబానికి సాయం



కల్లుగీత కార్మికుడికుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్: మండలంలోని పడకండ్లకు చెందిన కల్లుగీత కార్మికుడు బడికాల ప్రభాకర్ కుటుంబానికి నెల్లూరు జిల్లా కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్య గౌడ్, ఆశయ సాధన కమిటీ సంయుక్తంగా బాధిత కుటుంబానికి సోమవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. గతేడాది నవంబరు 30న ప్రభాకర్ ఈతచెట్టుపై కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. కార్యక్రమంలో గౌడ సేవా సమితి నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



అప్పారావుపాళెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంజనా సింహా, ఆర్డీఓ మధులత

ఆత్మకూరురూరల్: ఆర్డీఓగా శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సింహా సోమవారం మండలంలోని అప్పారావుపాళెం పోలింగ్ స్టేషన్‌ను ఆత్మకూరు ఆర్డీఓ మధులతతో కలిసి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ భవన వసతి, తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్ఐ పృథ్వీకుమార్, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు చంద్రా హజరత్‌నాయుడు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఉదయగిరి: మండలంలోని తిరుమలాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిని అరెస్ట్ చేశామన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు: మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన మద్దిరెడ్డి సుబ్బారెడ్డి, కొండమ్మ చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా సాయంత్రం ఆరు గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగింది. బ్యారన్‌లో వెయ్యి కర్రల పొగాకు క్యూరింగ్‌లో ఉందని తెలిపారు. ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షలు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సంగం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చిట్టచివరి లబ్ధిదారుడికి చేరే వరకు అధికారులు కృషి చేయాలని తద్వారా వికసిత్ భారత్ ఆకాంక్ష నెరవేరుతుందని ఎంపీడీఓ గోపీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తెలిపారు. సంగంలోని స్థానిక సచివాలయంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కాకు విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు



దగదర్తిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బీద, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- అట్టహాసంగా ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 నెలల పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో అట్టడుగు స్థాయిలో ఉండే ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తిలో 'ఆసరా' నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండలంలోని అన్ని పంచాయతీల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రాంగణమంతా మహిళా ఐక్యతను, ప్రగతిని చాటే రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యేతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలు, రైతులను నిలువునా ముంచారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలుగా సుమారు రూ.25,641 కోట్ల వడ్డీతో సహా మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేసి పొదుపు సంఘాలను బలోపేతం చేశారని వివరించారు. మహిళలు ఆర్థికంగా పురోగతి సాధిస్తే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి పథకాలు, పదవుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లకు చట్టం చేసేందుకు తొలి అడుగు వేసిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కావలి ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లినప్పుడు ఒక్కో కుటుంబం గడిచిన 50 నెలల కాలంలో రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మేర లబ్ధి కలిగిందని సంతోషంతో చెబుతున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో కూడా ఈ స్థాయిలో తమకు మేలు చేయలేదన్నారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పింఛన్ నుంచి పథకాల వరకు రేషన్ సరుకులతో సహా నేరుగా ఇళ్ల వద్దనే అందిస్తున్నట్లు చెప్పారన్నారు. పింఛన్ల రూపంలో ఏ ఆసరా లేని వృద్ధులకు, మహిళలకు నెలకు రూ.3 వేల వంతున ఏడాడికి రూ.36 వేలు అందిస్తూ ప్రభుత్వం పెద్ద దిక్కుగా నిలిచిందని తెలిపారు. ఒక రైతు రెండెకరాలు కష్టపడి పండిస్తే రూ.40 వేలు ఆదాయం మిగలడం కష్టంగా ఉంటే, ప్రభుత్వం అవ్వతాతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏడాదికి రూ.36 వేలు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. తొలుత దగదర్తిలో ఇటీవల అభివృద్ధి చేసిన అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, జెడ్పీటీసీ తాళ్లూరి స్వరూపారాణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎంగా రావాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ, మళ్లీ సీఎంగా రావాలి. ఆయన రుణమాఫీ, చేయూత, సున్నావడ్డీ, తదితర పథకాలతో మహిళలకు అన్నగా, పింఛన్లతో ఏ ఆసరా లేని అవ్వతాతలకు పెద్ద దిక్కుగా, పిల్లలకు సొంత మేనమామలా మంచి చదువు అందిస్తూ సొంత కుటుంబ సభ్యుడిలా పేదల పక్షాన నిలిచారు.

– లావణ్య, శ్రీరామపురం



వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంక్షేమ పథకాలతో ఆర్థిక ప్రగతి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి సాధించిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్రిపాడులో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత సంబరాలు నిర్వహించారు. వివిధ స్టాళ్లను పరిశీలించి సంబంధిత మహిళలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలతో తాము దుకాణాలను నిర్వహించుకుంటూ గౌరవ ప్రదంగా ఉన్నామని మహిళలు ఎమ్మెల్యేకు తెలపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత సభా ప్రాంగణం వద్ద ఏర్పాట చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ పాలన సాగించిందన్నారు. అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకపోవడంతో అనేక గ్రూపుల్లోని మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దేశ స్థాయిలో 18వ స్థానంలో ఉండే పొదుపు గ్రూపులు, జగనన్న మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేయడంతో మొదటి స్థానంలోనే నిలిచాయన్నారు. ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటూ అఖరులో అరకొరగా ఇవ్వడంతోనే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. జగనన్న తొలి ఏడాది నుంచే సంక్షేమం, అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నిలిపారని వివరించారు. ఇలాంటి సంక్షేమ ముఖ్యమంత్రిని ప్రజలంతా ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని, 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించేందుకు ప్రజలే ముందుండి ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి, జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మాధవరెడ్డి, బూత్ కమిటీ మేనేజర్ రేవూరు వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ నాగమణి, ఏసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళాభివృద్ధి సాధ్యం



ఆసరా చెక్కు అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే రాష్ట్రంలో మహిళలు అభివృద్ధి పథంలో నడుస్తున్నారని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు సోమవారం నిర్వహించారు. పొదుపు మహిళలు సమన్వయకర్త మేకపాటికి కోలాట ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా 68,094 మంది పొదుపు మహిళలకు సంబంధించి రూ.6.44 కోట్ల నగదును ఖాతాల్లో జమ చేశారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పొదుపు మహిళలకు సంబంధించిన రుణాలను 78.94 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు సంబంధించిన రూ.25,571 కోట్లు రుణాలను నాలుగు విడతలుగా వారి ఖాతాల్లోనే జమ చేశారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ఎటువంటి లంచాలకు తావులేకుండా నేరుగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుతుందోన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత మేకపాటి అభినవ్ రెడ్డి, జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరి కొండారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మహిళలు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న పొదుపు మహిళలు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో ఆసరా పథకం చెక్కుల అందజేతను పండగ వాతావరణంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి పొదుపు సంఘాల లీడర్లు, గ్రూపు సభ్యులు కోలాటాల భజనలు, మేళతాళాలతో మంగళ హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే, మహిళలు పాలాభిషేకం చేశారు. సభలో ఏఎస్‌పేట మహిళా కళాకారులు చేసిన కోలాట నృత్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎస్‌బీఐ మేనేజరు బెస్త రాఘవేంద్రను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఐవీ రమణారెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకురాలు షేక్ పర్వీన్, షేక్ రహీం, సయ్యద్ జమీర్, కలాం, నందవరం ప్రసాద్, ప్రసాద్, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత, వేమన పద్యాలను చదవాలి



చేజర్ల: ప్రతి ఒక్కరూ శ్రీ ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, యోగి వేమన పద్యాల అనుబంధ గ్రంథాలను చదవాలని త్రైత సిద్ధాంత సభ్యులు కోరారు. సోమవారం పెళ్లేరు, మాముడూరు, తూర్పుపల్లి, కొండలరాయుడు కండ్రిక, నడిగడ్డ అగ్రహారం, రెడ్డివారికండ్రిక, ఎర్రబల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, వేమల పద్యాల విశిష్టపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పెంచల నరసయ్య, కొండయ్య, కృష్ణయ్య, శస్త్రసాద్రి, పెంచలయ్య, నరసారెడ్డి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని మధుశ్రీకి ఆర్థిక సాయం అందజేస్తున్న, రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి

కలిగిరి: కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బడుగు మధుశ్రీ అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనడానికి ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆ విద్యార్థిని టార్గెట్ బాల్ క్రీడకు సంబంధించి మార్చిలో శ్రీలంకలో జరిగే పోటీలో పాల్గొనాల్సి ఉంది. మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు తన సొంత నిధులతో ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కలిగిరిలో ఇటీవల విద్యుదాఘాతంతో తీవ్ర అనారోగ్యానికి గురైన హోటల్ నిర్వాహకుడు షేక్ హజరత్తయ్యను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం: మండలంలోని తూర్పుఎర్రబల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిర్వాహకుడి వద్ద 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ ఖాజావలి సోమవారం తెలిపారు. బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హత కలిగిన వారికి భూ పంపిణీ

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- రెవెన్యూ అధికారులతో సమీక్ష



ట్రెయినీ కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి రెవెన్యూ సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అర్హత కలిగిన వారికే సాగు భూమి అందజేశారని, ఆయన బాటలోనే ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకే అసైన్‌మెంట్ భూములను పంపిణీ చేయాలని సంకల్పించినట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ కె మధులతతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లు, పార్టీ రెవెన్యూ సమన్వయ కమిటీ కన్వీనర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆశయం నెరవేరేలా రెవెన్యూ అధికారులు భూ వివరాలు రెండు రోజుల్లో సిద్ధం చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న భూమిలేని వారి జాబితాలను పరిశీలించారు. ఐదు ఎకరాల వరకు మెట్ట, రెండున్నర ఎకరాల మాగాణి ఉన్న వారు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఉంటే వారికి అనునయించి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని, ఆ గ్రామంలో అర్హులకు వాటిని పంపిణీ చేసేలా సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఏ ఒక్క అనర్హుడికి భూ పంపిణీ జరపరాదని, అర్హులకు తప్పనిసరిగా భూ పంపిణీ చేయాలన్నారు. ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధికారులు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మర్రిపాడు నాయకుడు గంగవరపు శ్రీనివాసులునాయుడు, కొండా వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, అన్ని మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అనధికారిక శిక్షణా కేంద్రంపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న వెంకటస్వామినాయుడు

ఉదయగిరి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు శిక్షణ పేరుతో కొందరు అనధికారికంగా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్రమంగా నగదు వసూలు చేయడం దారుణమని బీజేపీ మండల కన్వీనరు నెల్లూరు వెంకటస్వామినాయుడు అన్నారు. ఆయన సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వృత్తిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి శిక్షణ ఇచ్చి పనిముట్లతో పాటు రాయితీ రుణాలు మంజూరు చేసేందుకు విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. దరఖాస్తు చేసుకుని ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చేందుకు ఉదయగిరి బీసీ బాలుర వసతి గృహంలో అధికారికంగా కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. పట్టణంలోని మరో ప్రాంతంలో అనధికారికంగా కొందరు శిక్షణా కేంద్రం ఏర్పాటుచేసి లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారన్నారు. అనుమతులు చూపించాలని కోరితే చూపించడం లేదన్నారు. అనధికారికంగా నిర్వహిస్తున్న కేంద్రంపై చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పోలీసులకు సైతం సమాచారం ఇచ్చారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు షాజహాన్, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా మెడల్స్ సర్టిఫికెట్ల పంపిణీ



బహుమతులు ప్రదానం చేసిన ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ

అల్లూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలానికి చెందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ పంపిణీ చేశారు. ఖోఖో మహిళా విభాగంలో మొదటి బహుమతి, క్రికెట్, బ్యాడ్మింటన్ పురుషుల విభాగం ద్వితీయ బహుమతి, ఖోఖో, కబడ్డీ పురుషుల విభాగంలో తృతీయ బహుమతి, కబడ్డీ, బ్యాడ్మింటన్ మహిళ విభాగంలో తృతీయ బహుమతులను ప్రదానం చేశారు.

కరవళ్ల సేవలు అభినందనీయం



ఆత్మకూరు: మండలంలోని నల్లపరెడ్డిపల్లికి చెందిన కరవళ్ల రవీంద్రారెడ్డి తన తాత వరదారెడ్డి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. పట్టణంలోని వెంకయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో 35 మంది వృద్ధులకు నెలకు రూ.వంద చొప్పున ఏడాది పాటు (రూ.1200) పింఛన్లు, దుప్పట్లు అందజేశారు. అతిథులు మాట్లాడుతూ 2005 నుంచి రవీంద్రారెడ్డి పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నల్లపరెడ్డిపల్లి, బట్టేపాడు పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ చంద్ర వినోద్ రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎంలు కేవీ శేషారెడ్డి, ఎం చెంచురత్నం, కొల్లా కృష్ణయ్యనాయుడు, జేవీవీ నేత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతల్లో అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- కంపసముద్రం ప్రజల సంక్షేమానికి రూ.18.43 కోట్లు
- పలు భవనాలు ప్రారంభం



విజయీభవ యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు: ప్రజలకు చేస్తామని చెప్పిన ప్రతి సంక్షేమాన్ని, అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తున్నామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంపసముద్రంలో ఎమ్మెల్యే విజయీభవ యాత్రను నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి గ్రామంలో శాశ్వత అభివృద్ధిని చేసి చూపిస్తున్నామన్నారు. ఒక్క కంపసముద్రం గ్రామానికే రూ.18.43 కోట్ల సంక్షేమాభివృద్ధిని అందించామన్నారు. ఇప్పటి వరకు గ్రామస్తులు తెలిపిన 150 సమస్యల్లో చాలా వరకు పరిష్కరించామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో జగనన్న తెచ్చిన సంస్కరణల్లో పంచాయతీలో 151 మంది రైతులకు చెందిన 184.29 ఎకరాల చుక్కల భూముల సమస్యలు, సాదా బైనామా కింద 18 మంది రైతులు, నోషనల్ ఖాతాల కింద 101 మంది రైతుల సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6.2 లక్షలు అందజేసినట్లు పేర్కొన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, మిల్క్ సెంటర్, స్కూల్ ప్రహరీగోడ నిర్మాణాలకు మరో రూ.1.03 కోట్లు మంజూరు చేశామన్నారు. ఏడీఎఫ్ ద్వారా విద్యార్థులకు రూ.10 లక్షల వ్యయంతో స్కూల్ బస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి అవసరమైన పనులన్నింటిని గుర్తించి ప్రత్యేక మేనిఫెస్టోను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. జగనన్న తెచ్చిన వ్యవస్థలపై ప్రతిపక్ష పార్టీలు బురద జల్లేందుకు ప్రయత్నించామని, వారికి మళ్లీ అధికారం ఇస్తే ఈ వ్యవస్థలన్నిటిని రద్దు చేసి ప్రజలకు మళ్లీ ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ఇబ్బందులకు గురి చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. 2019 నుంచి మన సంక్షేమ ప్రభుత్వం ఒక్క రూపాయి అవినీతికి తావులేకుంటే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇలాంటి సంక్షేమాభివృద్ధి కొనసాగించేందుకు ప్రజలకు మళ్లీ తమ పూర్తి సహకారం అందించాలని, 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కంపసముద్రంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, సచివాలయం, మిల్క్ చిల్లింగ్ సెంటర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పాటు అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.